సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు అవసరం



మాదిగల ఉద్యమ చరిత్రను ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

నాంపల్లి: సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు అవసరమని, అలాంటి రచనలు సమాజంలోని రుగ్మతలను తొలగిస్తాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ద్రావిడ విశ్వవిద్యాలయం (కుప్పం) ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారాలను హుమయూన్ సంఘీర్ రచించిన 'కామునికంత', కె.వి.మేఘనాథరెడ్డి రచించిన 'కలుంకూరి గుట్ట'లకు అందజేశారు. అలాగే కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారాలను డాక్టర్ దిలావర్ రచించిన 'అడవి బతుకులు', సింహ ప్రసాద్ రచించిన 'నిర్మాల్యం'కు అందజేశారు. కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారాలను డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి రచించిన 'తాత్త్వికనేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం', వి.రాజా రామమోహన రావు రచించిన 'నవలా హృదయం 'అందజేసి సత్కరించి ప్రసంగించారు. సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చాలా అరుదుగా కనిపిస్తాయని భట్టి విక్రమార్క చెప్పారు. తాను ఎక్కువగా ఎన్నికలకు సంబంధించిన సభలు, సమావేశాలకు వెళ్తుంటానని, సాహితీ సమావేశాలకు వెళ్లడం అలవాటు లేదన్నారు. కొలకలూరి కుటుంబం పట్ల ఉన్న గౌరవార్థం పురస్కారాల ప్రదానోత్సవ సభకు విచ్చేసినట్లు తెలిపారు. అనంతరం ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు రచించిన మాదిగల ఉద్యమ చరిత్ర గ్రంథాన్ని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు, వి.ఎస్.యూనివర్సిటీ కళాశాల (కావలి) ప్రిన్సిపాల్ ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు, ఎస్వీ యూనివర్సిటీ ఈసీ మెంబరు, ఆంగ్ల శాఖాధ్యక్షులు ఆచార్య కొలకలూరి సుమకిరణ్, ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



స్పీకర్‌ను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: స్పీకర్ పదవికి కొన్ని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ తాను నిరంతరం ప్రజల్లో ఉండే మనిషినని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సోమవారం రవీంద్రభారతిలో అతిథి జాతీయ తెలుగు మాసపత్రిక దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్య, న్యాయ, పాత్రికేయ రంగాల్లో రాణిస్తున్న పలువురు నిపుణులకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సీనియర్ పాత్రికేయులు వెంకటేశ్వర్‌రావుతో తాను ఎంపీటీసీగా ఉన్నప్పటి నుంచి తమ ప్రయాణం కొనసాగుతుందని ఇద్దరం కింది స్థాయి నుంచి క్రమక్రమంగా ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డీఎస్.రెడ్డి, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలచారి, అతిథి మాస పత్రిక వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాపు సేవా ఆశ్రమ పాఠశాల వజ్రోత్సవాలు

దూద్‌బౌలి: నిజాం కాలంలో తెలుగు మాతృభాషను వ్యతిరేకిస్తున్న ఆరోజుల్లో బాలికల కోసం ప్రత్యేకంగా బాపు సేవా ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని వచ్చిన ఆలోచనకు పూర్తి స్థాయిలో మాతృ భాషలో విద్యాబోధన చేపట్టిన ఘనత సి.అశోక్‌కుమార్ యాదవ్‌కే దక్కుతుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కొనియాడారు. దూద్‌బౌలీలోని బాపు సేవా ఆశ్రం డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ సోమవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రముఖులను సన్మానించారు. వజ్రోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..30 ఏళ్లుగా అంచెలంచెలుగా ఎదుగుతూ ఆశించిన ఫలితాలు సాధిస్తున్న బాపు సేవా ఆశ్రమ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా ఆశ్రమ కార్యదర్శి విజయ పాల్ పాండే, ఉపాధ్యక్షులు బాలకృష్ణ ముదిరాజ్, రాకేశ్ తివారి, ఆనంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



త్రిపుర గవర్నర్‌ను సన్మానిస్తున్న బాపు సేవా ఆశ్రమ అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్

యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు ప్రారంభం



వర్చువల్‌లో ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



యాకుత్‌పురాలో శిలాఫలం ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు, నాయకులు

యాకుత్‌పురా: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 8.53 కోట్లతో చేపట్టానున్న యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు సోమవారం ప్రధాని నరేంద్రమోదీ కేంద్రా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైషనతో కలిసి వర్చువల్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైల్వే శాఖ హైదరాబాద్ డివిజన్ ఏడీఆర్ ఎం.ఏ రెహ్మాన్ మాట్లాడుతూ.. యాకుత్‌పురా స్టేషన్‌ను అన్ని హంగులతో ప్రధాన ద్వారం ఆహ్వాదకరమైన పచ్చదనంతో ప్రణాళికను రూపొందించి అభివృద్ధి చేయనున్నామన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా పార్కింగ్, ప్లాట్‌ఫాం విస్తరణ, షెల్టర్లు, టాయిలెట్లు, విశ్రాతి గదులు, స్టేషన్ పేర్లు ఎల్‌ఈడీ డిస్‌ప్లేలు ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఎఫ్‌ఎం సందీప్, రైల్వే ప్రోగ్రాం వ్యాఖ్యత డాక్టర్ రాణి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఐఎస్‌సదన్ కార్పొరేటర్ శ్వేతామధుకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ మహేశ్వర్, యాకుత్‌పురా కన్వీనర్ ధీరాజ్‌లాల్, నాయకులు వీరేందర్ బాబు, ఫిరాసత్ అలీబాక్రీ, రాజేశ్వర్, ఈశ్వర్ యాదవ్, స్థానిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి



ప్రత్యేక పూజల అనంతరం లచ్చుగుప్తా, సూర్యప్రకాష్ శుక్లాలు

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలు ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేస్తానని బజరంగ్ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చుగుప్తా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సూర్యప్రకాష్ శుక్లా పేర్కొన్నారు. కొమురవెల్లి ఆలయంలో బజరంగ్ సేనా తరపున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బజరంగ్ సేనా ఆధ్వర్యంలో తరచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయాల పరిరక్షణకు బజరంగ్ సేనా ముందుంటుందన్నారు. అన్ని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునిల్ అగర్వాల్, ఎర్రం శ్రీనివాస్, నరేష్, ఉదయ్ ముధిరాజ్ రాజారామ్, నీలేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

'అనాథ పిల్లలకు అండగా ఉంటాం'

అబిడ్స్: అనాథ పిల్లలకు అండగా ఉండి పలు రకాల సేవలందించేదుకు ముందుంటానని డాక్టర్ కిశోర్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. అనాథాశ్రమాలలో ఉచితంగా సేవలందిస్తే ఎంతో సంతోషంగా, తృప్తిగా ఉంటుందన్నారు. సోమవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ అనాథాశ్రమంలో అనాథ పిల్లలకు ఉచితంగా మెడికల్ చెకప్‌లు నిర్వహించి పలు రకాల మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. నిరంతరం బాస్ అనాథాశ్రమానికి పలు సేవలందిస్తానన్నారు. తరచూ పిల్లలకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. బాస్‌తో పాటు నగరంలోని పలు అనాథాశ్రమాలలో తాను ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి వారికి సేవలు అందించడమే తన ముఖ్యోద్దేశ్యమన్నారు.



బాస్ అనాథాశ్రమంలో విద్యార్థులతో కలిసి పాల్గొన్న డాక్టర్ కిశోర్ సింగ్ చౌహాన్

ఏమ నాలా..?



బృందావన్ కాలనీని ఆనుకోని ఉన్న బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

- డంపింగ్ యార్డుగా మారిన బుల్కాపూర్ నాలా
- పూడికతీత పనులు నిల్
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: నాలాల దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఒకప్పుడు మురుగునీటి ప్రవాహానికి వరద నీటికి కేర్‌ఆఫ్ అడ్రస్‌గా నిలిచిన బుల్కాపూర్ నాలా నేడు డంపింగ్ యార్డుగా మారింది. నీరుపోసి పెంచినట్లు నాలాలో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. దీనికి తోడు నాలాలో వ్యర్థాల డంపింగ్ యథేచ్ఛగా కొనసాగుతుంది. షేక్‌పేట్ నుంచి టోలిచౌకీ, బృందావన్ కాలనీ, హకీంపేట్ కుంట గుండా అహ్మద్ నగర్ వరకు కొనసాగే ఈ బుల్కాపూర్ నాలాకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ నాలాను అధికారులు పట్టించుకోపోవడంతో నాలా వెడల్పు క్రమేనా తగ్గుతూ వస్తోంది. వ్యర్థాల డంపింగ్‌తో నాలాను గుర్తుపట్టలేని పరిస్థితి ఉంది.

నాసిరకంగా ఫెన్సింగ్..

పూడికతీత పనులు ఫెన్సింగ్ ఏర్పాటు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నాసిరకం ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో ఆ ఫెన్సింగ్ నెల రోజులు కూడా ఉండడం లేదు. బృందావన్ కాలనీ నుంచి విరాట్‌నగర్ కుంట వైపు వెళ్లే నాలాకు ఎప్పుడో ఓవైపు సిమెంట్ ఇటుకల ప్రహరీ నిర్మించారు. అయితే సిమెంట్, ఇటుక రెండు నాసిరకం కావడంతో ఈ గోడ ఎప్పుడో కూలిపోయింది. అంతేకాకుండా దీనికి వేసిన ఇనుప ఫెన్సింగ్ సైతం కూలిపోయింది. పలుచోట్ల ఫెన్సింగ్ వేయడానికి వాడిన ఇనుప పైపులు పలు ప్రాంతాల్లో చోరీకి గురయ్యాయి.

నాలా నిర్మాణంపై నిర్లక్ష్యం...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నాలా పూడికతీత పనులు జరిగేవి. అయితే ఈ పూడికతీత సందర్భంగా నాలాలోని పిచ్చి మొక్కలను రోడ్డుపైనే వేసేవారు. పలు ప్రాంతాల్లో ఫెన్సింగ్ వద్దనే డంపింగ్ చేసే వారు. కొద్ది రోజుల్లోనే తీసిన పూడికతీతలు మళ్లీ నాలాలోకే చేరేవి. ఈ విధంగా భారీగా చేరిన పిచ్చి మొక్కల కారణంగా నాలాలో మురికి నీరు ముందుకు పోవడం లేదు. మరోవైపు నాలా ప్రహరీపైనే పలు చోట్ల అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఈ అక్రమంగా వెలిసిన ఇళ్ల నుంచి మురికి నీరు, వ్యర్థాలు నాలాలోకే వచ్చి చేరుతున్నాయి.

చిన్నపాటి వర్షానికే...

వర్షాకాలంలో నాలా సృష్టించే బీభత్సం అంతా ఇంతా కాదు. పూడికల కారణంగా నాలా లోతూ తగ్గిపోవడంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే నాలా పొంగిపొర్లుతుంది. ఈ కారణంగా నాలాను ఆనుకొని ఉన్న ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. రెస్టారెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, కూరగాయల వ్యాపారులు ఆటో ట్రాలీలలో తమ వ్యర్థాలను తీసుకువచ్చి నాలాలో డంప్ చేస్తున్నారు. వివిధ రకాల వ్యర్థాలతో నాలా మురికి కూపంగా మారుతుంది. ప్రస్తుతం నాలాను దోమల నాలాగా స్థానికులు పేర్కొంటున్నారు. నాలాలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కారణంగా తమకు కంటి మీద నిద్ర లేదని పలువురు స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా కేవలం వర్షాకాలంలోనే బల్దియా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి నాలాను సందర్శిస్తున్నారు. ఇది చేస్తాం, అది చేస్తాం అంటూ భారీగా ప్రకటనలు ఇస్తున్న అధికారులు నాలా బాగు కోసం ఒక్కపైసా కూడా కేటాయించడం లేదు. ఏదేమైనా బుల్కాపూర్ నాలా నిర్వహణ ఇలాగే కొనసాగితే కబ్జాలతో ఇది కనుమరుగు అవ్వడం ఖాయం.

అయోధ్య బయలుదేరిన బీజేపీ నేతలు



గోల్కొండ: అయోధ్య శ్రీరామ మందిరం నిర్మాణం సకల హిందువుల చిరకాల స్వప్నం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులతో కలిసి అయోధ్య బయలుదేరి వెళ్లారు. సోమవారం అయోధ్యలో శ్రీరామ్ లల్లా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముడు సకల హిందువుల ఆరాధ్య దైవం అన్నారు. శ్రీరామ దర్శనం చేసుకోవడంతో తన జీవితం ధన్యమైందని ఆయన అన్నారు.

ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల చర్యలు

గోల్కొండ: అగ్ని ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాలు జరగకుండా ఆసుపత్రిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక సిలిండర్లను సోమవారం ఆయన పరిశీలించారు. అగ్నిప్రమాదం జరిగిన సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలను ఆసుపత్రి సిబ్బందికి వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఆసుపత్రికి వచ్చే వారికి ఇన్ పేషంట్లతో పాటు ఔట్ పేషంట్ల విభాగాల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న దళితరత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు

అబిడ్స్: సమాజ సేవకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడుతాయని దళితరత్న అవార్డు గ్రహీత, నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ మాణిక్‌రావు పేర్కొన్నారు. ధూల్‌పేట లాల భవన్‌లో నిర్మాణ్, సిల్లికాన్ ల్యాబ్‌లు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వానికి తోడుగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు మురికివాడలు, బస్తీల ప్రజలకు ఒక వరంగా మారాయన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలచే గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విజయ సంకల్ప యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ



నాంపల్లి: తెలంగాణ బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా మల్లేపల్లి డివిజన్ నేతలు బైక్ ర్యాలీ చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు జగన్నాథరాజు నేతృత్వంలో ఈ ర్యాలీ ప్రారంభమైంది. డి క్లాస్ క్వార్టర్స్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై సీతారామ్‌బాగ్, మల్లేపల్లి, బజార్‌ఘాట్ మీదుగా నోబుల్ టాకీస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయం కో ఇన్‌చార్జి మంగళారపు రాందాస్, వైరమేష్ బాబు, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిట్



జియాగూడ: జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఈ నెల 28న వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిట్‌ను నిర్వహిస్తున్నట్లు గురుదత్త ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి, స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, ఇన్‌చార్జి మహేశ్వరీ తెలిపారు. సోమవారం స్కూల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎగ్జిబిట్ వివరాలను వెల్లడించారు. స్కూల్‌లో ఏర్పాటు అయ్యే ఎగ్జిబిట్‌లో సుమారు 150కి పైగా ప్రదర్శనలు విద్యార్థులు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఎగ్జిబిట్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా మానవ దళిత హక్కుల కార్యకర్త పీఎం.రాజు, జియాగూడ టీడీపీ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, బీజేపీ నాయకుడు ఠాకూర్ రఘునందన్ సింగ్ తదితరులు పాల్గొంటారన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



గోల్కొండ: స్వావలంబన, స్వశక్తితో భారతీయ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతరెడ్డి అన్నారు. గోల్కొండ బాగ్ మహిళా శక్తి సమన్వాయ కార్యక్రమం సోమవారం జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. కుటుంబ సభ్యుల బాగోగులు చూసుకుంటున్న మహిళ తన ఆరోగ్యాన్ని పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు అంశాలుగా జరిగిన ఈ కార్యక్రమంలో తదాస్తు కౌన్సెలింగ్ అండ్ కన్సల్టెన్సీ ఫండర్ వనజరవి, విద్యావేత్త దేవరకొండ లలితశ్రీహరి, కేఎంఐటీ ప్రిన్సిపాల్ మల్లీశ్వరీ, హైదరాబాద్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గీతాచౌదరి, దుర్గా వాహిణి తెలంగాణ ప్రాంత సంయోజిక వాణి సక్కుబాయి, సేవా భారతీ తెలంగాణ జాయింట్ సెక్రటరీ జయప్రదదేవి, క్షేత్ర బాలిక విద్య సహప్రముఖ్ రాజేశ్వరి, మాతృశక్తి తెలంగాణ సంయోజిక పద్మశ్రీ తదితరులతో పాటు గోల్కొండ బాగ్‌కు చెందిన సుమారు 1250 మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



కోర్సు పూర్తి చేసిన మహిళలతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: స్వయం ఉపాధితో మహిళలు ఎదగాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఎండిలైన్స్‌లోని ఫకర్ ఏ మిల్లత్ అబ్దుల్ వాహేద్ ఒవైసీ మహిళల శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కోర్సులలో ఈ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు ఎందరో మహిళలు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసి ఇంటి నుంచి వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. మహిళా ఉపాధి కల్పనలో ఎన్‌జీఓస్‌తో పాటు ఫకర్ ఏ మిల్లర్ అబ్దుల్ వాహేద్ ఒవైసీ మహిళా కోచింగ్ సెంటర్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఈ కేంద్రానికి హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీఅ త్వరలోనే వంద కుట్టు మిషన్‌లు బహుమతిగా ఇవ్వనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆలీమ్, రఫీ, ఖాజీ ఆలీమ్‌లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఎమ్మెల్యేను పూలమాల వేసి సన్మానించారు.


విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలక ఘట్టం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

గోల్కొండ: విద్యార్థుల జీవితంలో పదో తరగతి అత్యంత కీలక ఘట్టమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సయ్యద్ ఎక్బాల్ హసన్ రిజ్వీ అన్నారు. ఐటా ఆధ్వర్యంలో టోలిచౌకీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలంటే భయాన్ని జయించిన వారే పరీక్షలను బాగా రాయగలుగుతారన్నారు. పరీక్షలు రాయడానికి ఇంటి నుంచి బయలుదేరే ముందు బ్రేక్‌ఫాస్ట్ చేసి పరీక్షలు రాయడానికి వెళ్తున్నాననే ఆత్మ విశ్వాసంతో పరీక్షా కేంద్రానికి వెళ్లాలని ఆయన సూచించారు. ఐటా షేక్‌పేట్ మండల అధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ అలీఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఆరీఫ్, మహ్మద్ మహమ్మూద్ అలీ, ఖలీల్ ఉర్ రహమాన్, ముక్తి తజమ్ముల్ హుస్సేన్ ఖాస్మీ, సంపత్‌కుమార్ ఓహియా, ఫౌజియా బేగం తదితరులున్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సంతోష్ గుప్తా



సంతోష్ కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని కన్యాకా పరమేశ్వరి ట్రస్టు భవనంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా సర్వసభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహసభ నుంచి మ్యాడం దయాకర్ గుప్తా, ఎన్నికల పర్యవేక్షకులుగా దేవత శ్రీనివాస్‌లు వ్యవహరించారు. ఈ సమావేశంలో సరాబు సంతోష్‌కుమార్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా రాబోయే రెండేళ్లకు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా, మాజీ అధ్యక్షుల చీల రాములు గుప్తా, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, గుగ్గిళ్ల అశోక్ కుమార్, శ్రీరాం కోటయ్య గుప్తా, ప్రస్తుత అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజయ సంకల్ప యాత్ర



చింతలబస్తీలో కొనసాగుతున్న యాత్రలో కిషన్‌రెడ్డి

నాంపల్లి: భారీ జన సందోహం నడుమ బీజేపీ విజయ సంకల్ప యాత్ర ముందుకు సాగింది. ఈ విజయ సంకల్ప యాత్రలో సికింద్రాబాద్ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రజలు నీరాజనం పట్టారు. దారిపొడవునా అభిమానులు, కార్యకర్తలు కిషన్‌రెడ్డిపై పూలవర్షాన్ని కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు నాంపల్లి నియోజకవర్గంలోని చింతలబస్తీకి చేరుకోవాల్సి ఉండగా రాత్రి 9 గంటలకు చేరుకుంది. అక్కడి నుంచి మాసబ్‌ట్యాంక్, ఆంధ్రబ్యాంకు, నోబుల్ టాకీస్ చౌరస్తా వరకు కొనసాగింది. చింతలబస్తీ నుంచి నోబుల్ టాకీస్ చౌరస్తాకు చేరుకునేందుకు గంట సమయం పట్టింది. అక్కడ జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మరోసారి మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం మెహిదీపట్నం మీదుగా గుడిమల్కాపూర్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నేతలు రాహుల్‌చంద్ర, సందీప్‌సాయి, రాములు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి..



అమర్‌సింగ్

గోల్కొండ: నేడు బీజేపీ విజయ సంకల్ప యాత్ర గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి ప్రారంభమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్వాన్ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు గుడిమల్కాపూర్ స్వామి వివేకానంద విగ్రహం నుంచి ప్రారంభమైయ్యే ఈ యాత్రకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. దేశం కోసం మోదీ కోసం మనమంతా కలిసి మరోసారి కేంద్రంలో బీజేపీని గెలిపిద్దామని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగే విజయ సంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి పార్టీ ఆదేశిస్తే తాను పోటీ చేసి విజయం సాధిస్తానని ఆయన పేర్కొన్నారు. నేడు జరిగే విజయ సంకల్ప యాత్రలో నాయకులు, కార్యకర్తలు, అన్ని మోర్చాల నాయకులు పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్రలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండుయాదవ్‌తో పాటు నాయకులు పాల్గొంటారన్నారు. గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి ప్రారంభమైయ్యే ఈ యాత్ర తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం, దర్బార్ మైసమ్మ ఆలయం, కేసరి హనుమాన్ ఆలయం, మీదుగా పురానాపూల్ వరకు ర్యాలీ సాగుతుందని ఆయన తెలిపారు.

నిర్మల్‌కుమార్ యాదవ్‌కు సన్మానం



నిర్మల్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న బాల్‌రాజ్ కోట్ల, శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఓబీసీ సెల్ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ కోట్ల, ఇతర నాయకులు శ్రీనివాస్, కిశోర్‌కుమార్, రవీందర్ ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..తెలంగాణ తరహాలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన ధ్యేయమన్నారు.

నేడు అవార్డు ప్రదానం



వెంకటేశ్వర్లు యాదవ్

చార్మినార్: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు యాదవ్‌కు సర్ సీవీ రామన్ స్మారక అవార్డు–2024 అందజేస్తున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 28న పాతబస్తీ జ్ఞాన భారతి మోడల్ స్కూల్‌లో నిర్వహించే సదస్సులో ఆయనకు ఈ అవార్డు అందజేయనున్నామన్నారు. నిజాం కాలేజీలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధినిర్వహణ కొనసాగిస్తున్న ఆయన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఇప్పటికే ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు.

పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్

గన్‌ఫౌండ్రీ: సాహిత్య కళా రంగాలకు వెన్నుదన్నుగా నిలిచేటటువంటి ఆర్థిక ప్రోత్సాహకారులను గుర్తుపెట్టుకోవాలని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, నవసాహితీ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వంగూరి చిట్టెంరాజుకు గిడుగు రామ్మూర్తి ఉత్తమ భాషా సేవా పురస్కారం, రచయిత్రి అరుణకు గిడిగు రాజేశ్వర్‌రావు ఉత్తమ కథా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, టి.గౌరీశంకర్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు శ్రీనివాస వాసుదేవ్, ఝాన్సీ రాపర్తి ఎస్ఎస్వీ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇస్లాం మతంలో అందరూ సమానులే'

దూద్‌బౌలి: ఇస్లాం మతంలో అందరూ సమానులేనని లండన్‌కు చెందిన ముస్లిం మత పెద్ద అల్లమా మహ్మద్ ఫరో–ఉల్–ఖాద్రీ అన్నారు. షబే ఏ బరాత్‌ను పురస్కరించుకుని సిటీ కాలేజీ సమీపంలోని కుడా స్టేడియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇస్లాం సమానత్వాన్ని కలిగి ఉందన్నారు. ఇస్లాంలో పేద, గొప్ప అనే తారతమ్యాలు లేవని.. బానిస బతుకులు అసలే లేవని పేర్కొంటూ ఇస్లాంలోని పవిత్ర రాత్రి అయిన షబే ఏ బరాత్‌గురించి పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది మజీద్ అధ్యక్షత వహించగా.. మౌలానా హాఫీజ్ ముజఫర్ హుస్సేన్ ఖాన్ ఖాద్రీ బంద నవాజీ తదితరులు పాల్గొన్నారు.

షియా ముస్లింల ర్యాలీ

డబీర్‌పురా: 12వ ఇమామ్ మెహదీ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని సోమవారం షియా ముస్లింలు 15వ షాబాన్ ర్యాలీ నిర్వహించారు. డబీర్‌పురా కోమటివాడి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో తిరిగి రాజేంద్రనగర్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో షియా ముస్లింలతో పాటు ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ, సయ్యద్ అలీ రజా జావేద్ అబేద్, సయ్యద్ అలీ జాఫర్ అబేదీ, షోహేబ్, బాకర్, రజా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.